యూరియాకు ప్రత్యామ్నాయం 'నానో'

- వ్యవసాయంలో కొత్త దిశ
- అధిక దిగుబడులతోపాటు నేలసారానికి రక్షణ

పెన్‌పహాడ్ : పంటల దిగుబడిని పెంచేందుకు రైతులు రసాయన ఎరువులపై ఆధారపడడం వల్ల నేలసారం దెబ్బతినడమే కాకుండా పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా పర్యావరణ అనుకూలమైన నానో యూరియా ఒక ఉత్తమ ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో వరి, పత్తి, కంది, పెసర వంటి పంటల సాగు ఊపందుకుంది. ఈ తరుణంలో రైతులు యూరియా వినియోగంపై దృష్టి సారించడం అనివార్యం.

నానో యూరియా మేలు..

నానో యూరియా ద్రవ రూపంలో లభించే ఆధునిక ఎరువు. ఇది తక్కువ మోతాదులోనే పంటలకు ఎక్కువ పోషకాలను అందిస్తుంది. అర లీటరు నానో యూరియా దాదాపు 40 కిలోల గుళికల యూరియాకు సమానమని అధికారులు తెలుపుతున్నారు.



నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు(ఫైల్)

దీని వినియోగం వల్ల నేలసారం దెబ్బతినదు. పర్యావరణానికి కూడా మేలు కలుగుతుంది.

రైతులకు అవగాహన లేక..

రెండు సంవత్సరాల క్రితమే కేంద్ర ప్రభుత్వం నానో యూరియాను అందుబాటులోకి తెచ్చినప్పటికీ చాలా మంది రైతులకు దీనిపై సరైన అవగాహన లేదు. అందుకే రైతులు సంప్రదాయ యూరియాకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన వ్యవసాయ అధికారులు రైతులకు నానో యూరియా వల్ల కలిగే లాభాలను వివరించేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నానో యూరియా వినియోగంపై రైతులకు మరింత అవగాహన కల్పిస్తే అధిక దిగుబడులతోపాటు నేలసారాన్ని కూడా కాపాడుకునే అవకాశం ఉంది. ఇది యూరియా కొరత సమస్యను కూడా చాలావరకు తగ్గిస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం



నానో యూరియాపై రైతుల కు నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం. నానో యూరియా వాడకం వల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గడమే కాకుండా, చీడపీడల సమస్య కూడా తగ్గుతుంది. అంతేకాకుండా నేల, గాలి, నీటి కాలుష్యాన్ని కూడా నియంత్రిస్తుంది. ఇది పత్రరంధ్రాల ద్వారా మొక్క లోపలికి సులభంగా చేరి పంటల దిగుబడిని పెంచుతుంది.

– అనిల్‌కుమార్, ఏఓ

క్లుప్తంగా

క్షతగాత్రులకు సాయం



గుంతలో పడిన కారు

అర్వపల్లి : అర్వపల్లి నుంచి కొమ్మాల వెళ్తున్న ఒక కారు కాసర్లపహాడ్ తండా సమీపంలో ఆదివారం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అదే మార్గంలో వెళ్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానంద చారి ఈ సంఘటనను గమనించారు. వెంటనే ఆయన తన కారును ఆపి, ప్రమాద స్థలికి చేరుకుని గాయపడిన వారికి సహాయం అందించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులను పిలిపించి క్షతగాత్రులను తన కారులో ఆసుపత్రికి పంపించి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, దేవస్థాన డైరెక్టర్ జేరుపోతుల సోమయ్య, డీవైఎల్ఎస్ టీం సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన ప్రభావతితో సూపర్‌వైజర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు

అర్వపల్లి : మండలంలోని పర్సాయపల్లి గ్రామ అంగన్‌వాడీ టీచర్ కొప్పుల ప్రభావతి ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమెను అర్వపల్లి, తిమ్మాపురం అంగన్‌వాడీ సెక్టార్ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అనితతో పాటు రెండు సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఏటీఎస్ ఏర్పాటుకు కృషి

కోదాడరూరల్ : కోదాడలో ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్ (ఏటీఎస్) ఏర్పాటుకు కృషి చేస్తామని పలువురు రవాణా శాఖ అధికారులు అన్నారు. ఆదివారం పట్టణంలోని లారీ అసోసియేషన్ కార్యాలయంలో సూర్యాపేట ఆర్టీఓగా పనిచేసి పదోన్నతిపై వరంగల్ డీటీసీగా వెళ్తున్న సురేశ్‌రెడ్డికి ఏర్పాటు చేసిన అభినందన, సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇబ్బందుల్లో ఉన్న లారీ యజమానులకు చట్టపరంగా తమవంతు సహాయ సహకారం అందజేస్తామని తెలిపారు. కొన్ని సందర్భాల్లో లారీ డ్రైవర్ల తప్పులేకున్నా శిక్ష అనుభవించాల్సి వస్తుందని, రానున్న రోజుల్లో రోడ్డు ప్రమాదాల్లో ఎవరితప్పు ఉంటే వారికి శిక్షపడే విధంగా కొత్త టెక్నాలజీ అందుబాటులోకి రానుందని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్టీఓ, రవాణాశాఖ అధికారుల సంఘం గౌరవ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రిటైర్డ్ ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండ డీటీసీ వాణి, కామారెడ్డి డీటీఓ శ్రీనివాసరెడ్డి, జిల్లా డీటీఓ జయప్రకాష్, ఆర్టీఓ రవికుమార్ పాల్గొన్నారు.

వెంకయ్య జీవితం స్ఫూర్తిదాయకం

పెన్‌పహాడ్ : సీపీఎం సీనియర్ నాయకుడు మర్రిపెల్లి వెంకయ్య జీవితం స్ఫూర్తిదాయకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. మర్రిపెల్లి వెంకయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండలంలోని చీదెళ్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్య కుటుంబ సభ్యులు నిర్మించిన స్మారక స్థూపాన్ని ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన వెంకయ్య తన జీవితాంతం తాను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారని అన్నారు. గ్రామంలో అనేక నిర్బంధాలు, ఆటంకాలు, శత్రువుల దాడులు ఎదురైనప్పటికీ వాటిని తిప్పికొట్టడంలో ముందుండేవారని గుర్తుచేశారు. శత్రువుల నుంచి పార్టీని, కార్యకర్తలను కాపాడడంలో ఆయన చూపిన తెగువ మరువలేనిదని కొనియాడారు. అనంతరం పలువురు నాయకులు బాల భిక్షం ఆధ్వర్యంలో సీపీఎం ప్రజా సంఘాలలో చేరారు. సీపీఎం



చీదెళ్లలో స్మారక స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి

గ్రామ కార్యదర్శి కొండమీది రాములు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, సీపీఎం జిల్లా నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పులుసు సత్యం, వట్టపు సైదులు, ముత్యాలు, సైదా, చినపంగి నర్సయ్య, రణపంగ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు సంపూర్ణ మద్దతు

పెన్‌పహాడ్ : కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలనే డిమాండ్‌తో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాకు మోడల్ స్కూల్స్ సంఘం పీఎంటీఏ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని జిల్లా పీఎంటీఏ అధ్యక్షుడు గుండగాని రాజయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ జిలానీ, రాష్ట్ర బాధ్యుడు గుర్రాల సోమయ్యగౌడ్ తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ధర్నాలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వలల రక్షణలో గణనాథుడు

అర్వపల్లి : గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. అయితే మండలంలో పలు చోట్ల కోతుల కారణంగా గణనాథులకు రక్షణ కరువైంది. మండపాల్లోకి చొరబడుతున్న కోతులు విగ్రహాల వద్ద ఉన్న లడ్డూలు, ఇతర ప్రసాదాలను క్షణాల్లో ఎత్తుకెళ్తున్నాయి. దీంతో గణేష్ మండపాల నిర్వాహకులు ఈ సమస్య నుంచి బయటపడేందుకు వినూత్న మార్గాలను అన్వేషిస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల గ్రామంలో నిర్వాహకులు కోతులు లోపలికి రాకుండా గణేష్ మండపం చుట్టూ వలలు ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల తాత్కాలికంగా జాలీలను బిగించి మండపాలకు రక్షణ కల్పిస్తున్నారు.



అడివెంలలో మండపానికి చుట్టూ రక్షణగా ఏర్పాటు చేసిన వలలు

గోదావరి జలాలను విడుదల చేయాలి



అర్వపల్లి : మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి



బంధం వాగును పరిశీలిస్తున్న నాగార్జున రెడ్డి

అర్వపల్లి : సూర్యాపేట జిల్లాకు గోదావరి జలాలను తక్షణమే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అర్వపల్లిలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరాంసాగర్, ఎల్ఎండీ ప్రాజెక్టులు పూర్తిగా నిండి గేట్లు ఎత్తినప్పటికీ జిల్లాకు నీటిని విడుదల చేయకపోవడం శోచనీయమని అన్నారు. వర్షాకాలం సీజన్‌లో ఇప్పటివరకు నీటి విడుదల గురించి ఎలాంటి షెడ్యూల్ ప్రకటించకపోవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల కొరతను ప్రభుత్వం వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, రాజకీయ జోక్యం లేకుండా ఇళ్ల కేటాయింపులు జరగాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, పులుసు సత్యం, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రజలకు ఇబ్బందులు

నూతనకల్ : కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలనే రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రం నుంచి తుంగతుర్తి మండల పరిధిలోని సంగెం గ్రామానికి వెళ్లే రోడ్డు పునః నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెంకెపల్లి, సంగెం మధ్యలో ఉన్న బంధం వాగులో నిర్మించాల్సిన బ్రిడ్జిని కాంట్రాక్టర్ పూర్తిచేయకపోవడం వల్ల వర్షాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యాదగిరిరావు, కందాల శంకర్‌రెడ్డి, చూడి మధుసూదన్‌రెడ్డి, శ్రీరంగం, తొనుకునూరి ఉప్పలయ్య, బత్తుల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రుగొండను పర్యాటక కేంద్రం చేస్తాం

చివ్వెంల : ఉండ్రుగొండ గిరిదుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉండ్రుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.కోటి నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఉండ్రుగొండ గిరిదుర్గంలో సాంస్కృతిక, ఆధ్యాత్మికతకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. దేవస్థానం అభివృద్ధి ద్వారా స్థానిక భక్తులకు సౌకర్యాలు పెరగడమే కాకుండా, సూర్యాపేట జిల్లా పర్యాటకానికి ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్య



ఉండ్రుగొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న పటేల్ రమేష్ రెడ్డి

క్రమంలో ఉండ్రుగొండ అభివృద్ధి చైర్మన్ ఊర రామ్మూర్తి యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ చకిలం క్రిష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ లోకానికి చెరగని ముద్ర.. ఆరుద్ర



ఆరుద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భానుపురి సాంస్కృతిక కళావేదిక సభ్యులు

సూర్యాపేట: తెలుగు సినీ సాహిత్య చరిత్రలో అభ్యుదయ కవిత్వానికి ఊతమిచ్చిన గొప్ప కవి ఆరుద్ర అని భానుపురి సాంస్కృతిక కళావేదిక అధ్యక్షుడు గుండా రమేష్ అన్నారు. ఆరుద్ర (సదాశివ శంకర శాస్త్రి) శత జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలో సాహిత్య అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుండా రమేష్ మాట్లాడారు. ఆరుద్ర రచించిన 'త్వమేహం', 'సినీవాలి' వంటి కావ్యాలు ఆయనకు గొప్ప పేరు తెచ్చాయని తెలిపారు. 1950లో 'బీదలపాట్లు' సినిమాతో సినీ గీతాల రచయితగా తన ప్రస్థానం ప్రారంభించారని, ఆ తర్వాత వేల సంఖ్యలో పాటలు రాశారని కొనియాడారు. కార్యక్రమంలో కళావేదిక సభ్యులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో సౌరహోమం, ప్రత్యేక పూజలు

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని చాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌర హోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్,



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

కర్నాటి నాగేశ్వర్‌రావు, కాశబోయిన సత్యనారాయణ, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, శ్రీరాం పాండే, మోనూపాండే, భక్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులకు శంకుస్థాపన



నాగారంలో ఇందిరమ్మ ఇళ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న కడియం పరమేశ్వర్

నాగారం : నాగారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పనులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, హైకోర్టు న్యాయవాది కడియం పరమేశ్వర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాగారం గ్రామానికి 24 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో త్వరలోనే గ్రామానికి మరో 40 ఇళ్లు మంజూరు కానున్నాయని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, గద్దల సైదులు, పాల్వాయి పరశురాములు, అనంతుల వెంకటయ్య, చిప్పలపల్లి అంజయ్య, సోమయ్య, కడియం శ్యామ్, సతీష్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం పోరాడాలని కార్యకర్తలకు, ప్రజా సంఘాల నాయకులకు సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. దోసపహాడ్‌లో కొండేటి రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరబోయిన రవి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోగుల సోమయ్య, చెన్ను ఎలమందమ్మ, కొండేటి అంజయ్య, భోగరాజు సోమయ్య, వల్లభట్ల శ్రీను, చెన్ను రవీందర్‌రెడ్డి, వినోద్, కృష్ణ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరబోయిన రవి

ముమ్మరంగా ఊటకుంటల నిర్మాణం



లోయపల్లిలో నిర్మించిన ఫారం పాండ్



తిమ్మాపురంలో నిర్మించిన ఊటకుంట

- రైతులకు ఉపయోగకరంగా పనులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో, ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) కింద వాటర్‌షెడ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనుల ప్రధాన లక్ష్యం నీటి నిల్వను పెంచడం, భూగర్భ జలాలను వృద్ధి చేయడం. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 4.39 కోట్ల రూపాయల నిధులతో పలు నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే అడివెంల, తిమ్మాపురం, కాసర్లపహాడ్, కోడూరు, కొమ్మాల, లోయపల్లి, సూర్యనాయక్ తండా గ్రామాలలో ఈ పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 12 ఊట కుంటలు, 13 ఫారం పాండ్స్, 5 చెక్‌డ్యామ్‌లను నిర్మించారు. ఈ వాటర్‌షెడ్ పనుల పురోగతిని జిల్లా ప్రాజెక్టు అధికారి వినయ్ భార్గవ్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మండలంలోని పలు గ్రామాలకు నీటి వనరులు మెరుగుపడి, వ్యవసాయానికి, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

పనులు కొనసాగుతున్నాయి



మండలంలోని 7 గ్రామాల్లో వాటర్‌షెడ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 12 ఊటకుంటలు, 13 ఫారం పాండ్‌లు నిర్మించడం జరిగింది. మిగిలిన పనులు జరుగుతున్నాయి.

– నగేష్, జేఈ వాటర్‌షెడ్

రైతులు పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

నాగారం : ఫణిగిరి, చెన్నాపురం శివారులో భూములు గల రైతులు పంటల సాగు వివరాలను సోమవారం నమోదు చేసుకోవాలని ఫణిగిరి క్లస్టర్ ఏఈఓ జి.శ్రీను తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు సాగు చేస్తున్న పంట వివరాల ఆధారంగానే ధాన్యం, పత్తి, ఇతర పంటలు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పంటల వివరాలు నమోదు చేసుకోని రైతులు తమ పంటలను కేంద్రాలలో అమ్ముకోలేరని సూచించారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి

కోదాడరూరల్ : ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం పలు రకాల సబ్సిడీలు అందజేస్తుందని ప్రాంతీయ ఉద్యానవన అధికారి అనిత తెలిపారు. ఆదివారం చిమిర్యాలలో రైతు కృష్ణయ్య చేపడుతున్న ఆయిల్‌పామ్ తోటలో మొక్క నాటి మాట్లాడారు. ఆయిల్‌పామ్‌కు మార్కెట్‌లో డిమాండ్ ఉందని, రైతులు సాగు చేసుకుంటే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని అన్నారు. నీటి వసతి ఉన్న రైతులు ఇతర పంటలకు బదులు ఆయిల్‌పామ్ సాగు చేస్తే నాలుగేళ్ల తర్వాత నుంచి దాదాపుగా 20 ఏళ్లకు పైగా దిగుబడి పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం డ్రిప్, ఎరువులు, అంతర పంటల సాగుకు సబ్సిడీలు కూడా ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రావు, ఆయిల్‌పామ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్, లక్ష్మణ్, గణేష్, రైతులు పాల్గొన్నారు.

చరిత్రను వెలుగులోకి తేవాలి

కోదాడ : తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్రను వెలుగులోకి తీసుకురావాలని, దీనికోసం తెలంగాణ వాదులు కృషిచేయాలని ప్రజాచైతన్య వేదిక కన్వీనర్ రాయపూడి చిన్ని కోరారు. ఆదివారం కోదాడ పట్టణంలోని ఎంఎస్ కళాశాల ఆవరణలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చిత్రం పోస్టర్‌ను ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. చిత్రంలో తెలంగాణ కళాకారులకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాణ కమిటీ చైర్మన్, సహ నిర్మాత అంకతి అనసూర్య, పందిరి నాగిరెడ్డి, బడుగుల సైదులు, పాలూరి సత్యనారాయణ, కోదాడ గురవయ్య, చందా శ్రీనివాస్, రామనర్సయ్య, మజహర్, సంకతాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నాగారం : అంజయ్య కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

నాగారం : నాగారం మండల పరిధిలోని పస్తాల గ్రామానికి చెందిన కండే నాగార్జున తండ్రి కండే అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా కండే నాగార్జున 2009–10 టెన్త్ క్లాస్ స్నేహితులు ఆదివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.30,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఎలక్ట్రీషియన్లు

అర్వపల్లి : మండల పరిధిలోని తుంగగూడెం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ నర్సింగ యల్లయ్య తల్లి ఇటీవల అకాల మరణం చెందారు. దీంతో బాధలో ఉన్న యల్లయ్యకు అండగా నిలిచేందుకు తోటి ఎలక్ట్రీషియన్లు తమ వంతుగా ముందుకు వచ్చారు. ఆదివారం ఎలక్ట్రీషియన్ల యూనియన్ మండల అధ్యక్షుడు బైరబోయిన భూమయ్య, కార్యవర్గ సభ్యులు బైరిక శ్రీనివాస్, కొప్పోజు సతీష్, రాచూరి ఉపేందర్, మంచాల అనిల్, నర్సింగ నరేష్ కలిసి యల్లయ్యకు రూ.5 వేల సాయం అందజేశారు.

గణనాథుడి విగ్రహాల వద్ద కొనసాగుతున్న పూజలు



సూర్యాపేట : 33వ వార్డు విద్యానగర్‌లో పూజలో పాల్గొన్న భక్తులు



సూర్యాపేట : అలంకార్ చౌరస్తాలో..



సూర్యాపేట : హోమంలో పాల్గొన్న భక్తులు



తిరుమలగిరిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



తిరుమలగిరిలో..



సూర్యాపేట టౌన్ : రెడ్డి హాస్టల్ సమీపంలో..



సూర్యాపేట : 39వ వార్డులో..



అర్వపల్లి : ఎస్సీ హాస్టల్‌లో ..



నూతనకల్ : మిర్యాలలో గణేశుడి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు